సాక్షి
పార్వతీపురం మన్యం

సోమవారం । 29 । జూలై । 2024



గోవులకు విముక్తి

సకల దేవతలు కొలువైన మాతగా హిందూ ధర్మ ఆచార సంప్రదాయాల ప్రకారం గోవుకు అత్యంత ప్రాశస్త్యం ఉంది.

- 8లో



కుష్టుతో చాలా కష్టం

కుష్టు వ్యాధి జిల్లాలో చాప కింద నీరులా వ్యాపిస్తోంది. జిల్లాలో నిర్వహిస్తున్న ఇంటింటా నిర్వహించే సర్వేలో కొత్త కేసులు బయట పడుతున్నాయి.

- 8లో



అంగన్‌వాడీలకు చిన్నగుడ్లు!

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నసైజు గుడ్ల సరఫరాపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- 8లో

న్యూస్‌రీల్

ఐటీడీఏ పీవోను కలిసిన గిరిజన సంఘాలు



పీవోను కలిసి సన్మానిస్తున్న గిరిజన ఐక్యవేదిక నాయకులు

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి టి.రాహుల్‌కుమార్‌రెడ్డిని రాష్ట్ర గిరిజన సంఘాల ఐక్యవేదిక నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సన్మానించారు. ఉమ్మడి జిల్లాలో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలు, గిరిజన హక్కులు కాపాడాలని, గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని, ఐటీడీఏలో ఖాళీగా వివిధ శాఖల్లో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని వినతిపత్రం అందజేశారు. పీవోను కలిసిన వారిలో బి.తేజేశ్వర రావు, ఎ.మన్మథ రావు, బి.అప్పన్న, కె.సుబ్బారావు, ఎం.రవికుమార్, ఎస్.కాంతారావు, ఎస్.రాజారావు, బి.సూర్యరావు, పి.శ్రీను, వి.సుగ్రీవులు తదితరులు ఉన్నారు.

30న జాబ్ మేళా



జిల్లా ఉపాధి కల్పన అధికారి వహీదా

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 30న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి వహీదా తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ సేల్స్ అధికారి, అడ్వైజర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, 18 సంవత్సరాలు పైబడిన పదవతరగతి, ఇంటర్మీడియట్, గ్రాడ్యుయేషన్ అర్హత కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. మొత్తం 80 ఖాళీలు ఉన్నాయని, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఎన్‌సీ ఎస్.జీఓవీ.ఇన్ లాగిన్‌లో పేరు నమోదుచేసుకుని బయోడేటా, 2 పాస్‌పోర్ట్ ఫొటోలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

'ఉత్తమ' అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

- ఉపాధ్యాయులకు డీఈఓ పిలుపు



డీఈఓ జి.పగడాలమ్మ

పార్వతీపురంటౌన్: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారిణి జి.పగడాలమ్మ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. సెప్టెంబర్ 5, 2024 గురుపూజోత్సవం సందర్భంగా అందజేసే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు సంబంధించి జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న అర్హత కలిగిన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు నమూనాను సంబంధిత మండల విద్యాశాఖాధికారి వారి కార్యాలయంలో పొందవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకునే ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయుల సర్వీసు 15 సంవత్సరాలు నిండి ఉండాలని, ఇంతకు ముందు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ఉపాధ్యాయులు అర్హులని తెలిపారు. ఎటువంటి క్రమశిక్షణ చర్యలు లేని వారై ఉండాలని స్పష్టం చేశారు. ఆసక్తి, అర్హత కలిగిన ఉపాధ్యాయులంతా పూర్తి చేసిన దరఖాస్తులను సంబంధిత మండల విద్యాశాఖాధికారి, ఉప విద్యాశాఖాధికారి ద్వారా డీఈఓ కార్యాలయానికి సమర్పించాలని వివరించారు.

నేడు ఐటీడీఏలో పబ్లిక్ గ్రీవెన్స్

సీతంపేట: సీతంపేట ఐటీడీఏలోని ఎస్‌ఆర్‌శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నూతన ప్రాజెక్టు అధికారి టి.రాహుల్‌కుమార్ రెడ్డి పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు అధికార వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. ఈ కార్యక్రమంలో గిరిజనులు సమస్యలపై వినతులు సమర్పించవచ్చని పేర్కొన్నారు.

దిగుబడి ఫలప్రదం



బుట్టలతో విక్రయానికి తీసుకువస్తున్న గిరిజనులు



కొండలపై సేకరించి మార్కెట్‌కు తరలించడానికి సిద్ధం చేసిన రైతులు

వ్యాపారం సంగతేంటి?

- 5 వేల ఎకరాల్లో సాగు
- 5 వందల టన్నులకు పైగా దిగుబడి
- లాభం కోసం గిరిజనుల ఎదురుచూపులు
- మన్యంలో ఆరంభమైన సీతాఫలాల సీజన్



ట్రేలలో సీతాఫలాలు వేస్తున్న వ్యాపారి

సీతంపేట: మధుర ఫలాలుగా పిలవబడే సీతాఫలాల సీజన్ సీతంపేట మన్యంలో ఆరంభమైంది. ఈ ఏడాది దిగుబడులు కూడా అధికంగా ఉంటాయని గిరిజనులు చెబుతున్నారు. అయితే మద్దతు ధర ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. ప్రతి శనివారం కుశిమి వారపు సంతకు, ఆది, సోమవారాల్లో సీతంపేట మార్కెట్‌కు సీతాఫలాలను గిరిజన రైతులు తీసుకువస్తున్నారు. కావిడ సీతాఫలాల ధర రూ.800ల నుంచి రూ.1000ల వరకు విక్రయిస్తున్నారు. గతేడాది రూ.1000కి పైబడే అమ్మకాలు జరిపామని గిరిజనులు తెలియజేస్తున్నారు. ఇప్పుడు ప్రారంభమైన సీజన్ అక్టోబరు మొదటి వారంతో ముగుస్తుంది. సీజన్ మధ్యలో ఎక్కువ మంది మార్కెట్‌కు సీతాఫలాలు తీసుకువస్తే దళారీ వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించేస్తారని గిరిజన రైతులు వాపోతున్నారు. అప్పుడు కావిడ రూ.500లకు కూడా పడిపోయే పరిస్థితి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గిరిజనులకు పైనాపిల్ తర్వాత అత్యధిక ఆదాయాన్ని తెచ్చే పంట ఇది. ఈ ఏడాది పైనాపిల్ పండ్లతో నష్టాలు చవిచూసిన గిరిజనులు సీతాఫలంలోనైనా ఆదాయాలు వస్తాయేమోనని ఆశిస్తున్నారు. ఒడిశా, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి సీతాఫలాలను కొనుగోలు చేస్తారు. ఆయా ప్రాంతాల్లో వారు కిలోల వంతున విక్రయించి లాభాలు ఆర్జిస్తారు. ఇక్కడ మాత్రం కిలో సరాసరి రూ.20లకు కొనుగోలు చేసిన వ్యాపారులు మైదాన ప్రాంతాల్లో కిలో రూ.60 నుంచి 80 వరకు విక్రయిస్తారు. కొంతమంది దళారీ వ్యాపారులు సీజన్ ఆరంభంలోనే గ్రామాల్లోకి వెళ్లి అడ్వాన్సులు ఇచ్చి కొనుగోలు చేస్తారు. అప్పట్లో కావిడకు రూ.400 చొప్పున వ్యాపారులు అడ్వాన్స్ ఇస్తే ఇప్పుడు కూడా అదే ధరకు వ్యాపారులకు విక్రయించాల్సి ఉంటుంది.

5 వేల ఎకరాల్లో పంట సాగు..

సీతంపేట ఏజెన్సీలో కొండపోడు వ్యవసాయంలో భాగంగా దాదాపు 5 వేల ఎకరాల్లో సీతాఫలం పంట సాగవుతుంది. సుమారు 500ల టన్నుల వరకు దిగబడి వస్తుంది. ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు పెట్టుబడులు పెట్టడానికి ఈ పంట ఎంతో దోహదపడుతుందని గిరిజనులు చెబుతున్నారు. గతేడాది మొదట్లో ఇదే ధరలు ఉన్నప్పటికీ మధ్యలో ధరలు తగ్గిపోయాయి. గిరిజనులు నిల్వ చేసుకోవడానికి వీలుకాని పండ్ల జాతిలో సీతాఫలం ఒకటి. చెట్టు నుంచి తీసిన పండ్లను రెండు, మూడు రోజుల్లో విక్రయించకపోతే పండు కుళ్లిపోతుంది. సోమవారం సీతంపేట, బుధవారం మర్రిపాడు, శనివారం పొల్ల, కుశిమి, గురువారం దోనుబాయిలలో జరిగే వారపుసంతల్లో వాటిని విక్రయిస్తారు.

దిగుబడి ఉన్నా ధరలు ఏవీ?



దిగుబడి ఉన్నా ధరలు ఎంతవరకు నిలబడతాయో తెలీదు. గతంలో ఒక్కొక్కరు రూ.10 వేల వరకు ఆదాయం సంపాదించే వారు. ఇప్పుడు ఎలా ఉంటుందో తెలియదు. వ్యవసాయ పెట్టుబడులకు డబ్బులు లేని పరిస్థితి ఉంది.

ఎస్.సురేష్, బుడగరాయి

ఏటా నష్టాలు తప్పడం లేదు



ప్రతి ఏటా నష్టాలు తప్పడం లేదు. సీజన్ ఆరంభంలో సరైన ధరలు పలుకుతాయి. మధ్యలో ధరలు పడిపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. పైనాపిల్ విక్రయాల్లో కూడా నష్టాలు చవిచూశాం.


ఎస్.తవుడు, అక్కన్నగూడ

విద్యార్థులతో చెలగాటం



పాఠశాల ఎదుట నిరసన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ బృందం, విద్యార్థులు

- ఆశ్రమ పాఠశాలలో ఉడికీఉడకని భోజనం
- వంటకాలను పరిశీలించిన ఎస్‌ఎఫ్‌ఐ బృందం



ఉడికీఉడకని బిర్యాని

మక్కువ: మండలంలోని ఎర్రసామంతవలస ఆశ్రమపాఠశాలలో ఉడికీఉడకని వంటకాలు విద్యార్థులకు వడ్డిస్తున్నారని ఆగ్రహిస్తూ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కోశాధికారి టి.అఖిల్ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు అఖిల్ మాట్లాడుతూ ఆశ్రమపాఠశాలలో ఆదివారం ఉడికీ, ఉడకని బిర్యానీని విద్యార్థులకు అందజేయడం గుర్తించామని, గడిచిన 14రోజుల క్రితం కూడా ఇటువంటి భోజనం వడ్డించారని ధ్వజమెత్తారు. భోజన సదుపాయం బాగోలేదని పాఠశాల వార్డెన్, హెచ్‌ఎంకు విద్యార్థులు తెలియజేస్తే, టీసీలు ఇచ్చి ఇంటికి పంపించివేస్తామని బెదిరించినట్లు విద్యార్థులంతా వారి తల్లిదండ్రులు, తమ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. నాసిరకం భోజనాలు వండి, వడ్డించి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని, అటువంటి వార్డెన్, హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు పాఠశాలకు వెళ్లి, దర్యాప్తు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు హెచ్.సింహాచలం, కె.డేవిడ్, జి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక పనులు వేగవంతం

- ఐటీడీఏ పీవో రాహుల్‌కుమార్ రెడ్డి
- గురుకుల పాఠశాలల పరిశీలన



ఆడలి వ్యూపాయింట్ పనులు చూస్తున్న పీవో రాహుల్‌కుమార్‌రెడ్డి

సీతంపేట: ఏజెన్సీలో పర్యాటక పనులు వేగవంతం చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన సీతంపేట మండలంలోని ఆడలి వ్యూ పాయింట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు ఏఏ పనులు పూర్తి చేశారు? ఇంకా చేయాల్సిన పనుల గురించి తెలుసుకున్నారు. అనంతరం శంబాం గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు పెడుతున్న మెనూను పరిశీలించారు. రుచికరమైన భోజనం అందివ్వాలని హెచ్‌ఎం, వార్డెన్లకు సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కోరారు. అలాగే మల్లి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను సందర్శించి తాగునీటి సమస్యపై ఆరా తీశారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని చెప్పారు. వంటగదిలో వండిన మెనూను చూశారు. అంతకుముందు సీతంపేటలో జరుగుతున్న వారపు సంతను సందర్శించి అక్కడికి గిరిజనులు ఏఏ అటవీఉత్పత్తులు తీసుకువస్తున్నారు? మార్కెటింగ్, వసతులను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని హితవు పలికారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈ సింహాచలం, జేఈ నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు సంఘటితంగా ఉండాలి

- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్



నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన సభ్యులతో మాజీ ఎంపీ వెంకటేష్

కొత్తవలస : ఆర్యవైశ్యులు సంఘటితంగా ఉండాలని తాము అండగా ఉంటామని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. మండల కేంద్రంలోని ఓ కల్యాణ మండపంలో విజయనగరం, విశాఖపట్నం జిల్లాల ఆర్యవైశ్యుల సంఘాల నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. విజయనగరం జిల్లా సంఘం అధ్యక్షుడిగా చెరుకూరి నాగరాజు, విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడిగా కొల్లూరి సత్యనారాయణతో పాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటేష్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు తమ సంఘం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఆర్యవైశ్యులకు సమాజంలో మంచి గౌరవం ఉందని, ఆ గౌరవాన్ని నిలబెట్టాలన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు కాశీలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయాలకు ఆర్యవైశ్యులు దానం చేసిన స్థలాలను కాపాడుకునేందుకు సిద్ధం కావాలన్నారు. నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, ఎమ్మెల్సీ దూండి రాకేష్, ఆర్యవైశ్యుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తవ్వా మోహన్‌రావు, స్థానిక ఆర్యవైశ్యుల ప్రతినిధులు పాల్గొన్నారు.

కవికి సమాజ దృష్టి ఉండాలి

- కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కార గ్రహీత బాలసుధాకర్ మౌళి



'కాలం కత్తి మొనమీద' పుస్తకావిష్కరణ

రాజాం సిటీ: కవికి సమాజ దృష్టి ఉండాలని, సమాజంలోని హెచ్చుతగ్గులను చిత్రీకరించగలగాలని, ఆవేదనలను, కన్నీళ్లను కవితాత్మకంగా రాసి ప్రజల హృదయాలను కదిలించాలని కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కార గ్రహీత బాల సుధాకర్ మౌళి అన్నారు. స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో రాజాం రచయితల వేదిక 114వ సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యవక్తగా హాజరైన ఆయన ముందుగా వేదిక నిర్వాహకులు గార రంగనాథం రచించిన 'కాలం కత్తి మొనమీద' అనే కవితా సంపుటిని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఏదో మూల ఎక్కడో ఒకచోట యుద్ధాలు, దోపిడీలు, తిరుగుబాట్లు జరుగుతూనే ఉన్నాయన్నారు. అలాంటి సమయాల్లో జరిగిన మార్పుల్ని, కలిగిన ఆవేదనలని కవిత్వీకరించగలిగిన వాడే గొప్ప కవి అవుతాడని పేర్కొన్నారు. అప్పుడే ప్రపంచ వ్యాప్తమైన కీర్తి గడిస్తాడని అన్నారు. పాలస్తీనా, ఉక్రెయిన్, సిరియా వంటి ప్రాంతాలలో యుద్ధాలు జరిగి వేలాది మంది హింసకు గురౌతున్నారని వివరించారు. నైజీరియా, లాటిన్ అమెరికా, శ్రీలంక, యూరోపియన్ దేశాలలో జరుగుతున్న అన్యాయాల మీద అక్రమాలపై అక్కడి వారి ఆవేదన మీద ఆయా ప్రాంతాలలో గొప్పకవులు కవిత్వాన్ని సృష్టించారని, అలాంటి కవిత్వం చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. పిల్లా తిరుపతి రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేదిక సభ్యులు స్వామినాయుడు, భుజంగరావు, రంగనాథం, సాంబమూర్తి, దాసుబాబు, వరహానరసింహులు, జనార్దనరావు, డాక్టర్ గార రవిప్రసాద్, పాపారావు, దయానిధినాయుడు, డాక్టర్ ఆల్తి మోహనరావు తదితరులు పాల్గొన్నారు

కూటమి ప్రభుత్వంలో..
విధ్వంసకర పాలన



దన్నానపేటలో కూల్చిన ప్రహరీని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- ఇలాంటి సంస్కృతి జిల్లాలో ఎప్పుడూ లేదు
- ఆర్మీ జవాను సేవలకు మీరిచ్చే గౌరవం ఇదేనా?
- అధికారం శాశ్వతం కాదని తెలుసుకోవాలి
- వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు



మాజీ ఆర్మీ జవాన్ వెంకినాయుడుతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు, మాజీ ఎంపీ బెల్లాన, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో విధ్వంసకర పాలన జరుగుతుందని జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ డిప్యూటీ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని దన్నానపేటలో మాజీ ఆర్మీ జవాన్ పతివాడ వెంకినాయుడు కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించి భరోసా కల్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... సైనికుడిగా దేశానికి 24 సంవత్సరాలు సేవ చేసి కష్టార్జితంతో ఇంటిని కట్టుకుంటే మానవతా దృక్పథం లేకుండా ప్రహరీ కూల్చివేయడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న విధ్వంసకర పాలనలో ఇదొక అరాచకమని ఆయన పేర్కొన్నారు. ఎవరికీ ఎటువంటి అడ్డు లేకపోయినా కేవలం వైఎస్సార్‌సీపీకు మద్దతుగా ఉన్నాడనే కక్షతో ఆర్మీ జవాను కష్టార్జితాన్ని కూలగొట్టారని, జిల్లాలో ఇలాంటి సంస్కృతి ఎప్పుడూ లేదన్నారు. ఆర్మీ జవాను సేవలకు మీరిచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. రాజకీయాల్లో అనేక సందర్భాల్లో పాలక పక్షంతో పాటు ప్రతిపక్షంలోనూ ఉన్నామని... అధికారం మాకు కొత్త కాదన్నారు. ఏ పార్టీ అయినా ఇలాంటి కక్ష సాధింపులకు ఎప్పుడూ తాము దిగలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత జిల్లాలో అనేక సంఘటనలు జరుగుతున్నాయని, తెర్లాం మండల కేంద్రంలో కూడా వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇంటి కాలువపై సిమెంట్ పలకలను కూలగొట్టారని గుర్తు చేశారు. అభివృద్ధి చేయమని ప్రజలు అధికారమిస్తే విధ్వంసం చేస్తూ ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నారన్నారు. జిల్లాలో కూటమి ప్రభుత్వం చేస్తున్న చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అధికారం శాశ్వతం కాదని, అధికారులు ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని హితవు పలికారు. గ్రామ పెద్దల సమాచారంతో ముందు రోజే కలెక్టర్, ఆర్డీఓతో మాట్లాడానని, అన్ని ఆక్రమణలు తొలగించి సమన్యాయం చేయాలని చెబితే...టీడీపీ ఆక్రమణదారులకు తూతూ మంత్రంగా నోటీసులు ఇచ్చి ఆర్మీ జవాను ఇంటి గోడను మాత్రమే కూల్చారన్నారు. ఇది మంచి సంప్రదాయం కాదన్నారు. మాజీ ఆర్మీ జవాను కుటుంబానికి వైఎస్సార్‌సీపీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

రాజకీయ కక్షతో భయాందోళనలు సృష్టించడం తగదు

ప్రజలకు అండగా నిలవాల్సిన ప్రభుత్వాలు రాజకీయ కక్షలతో భయాందోళనలు సృష్టించడం తగదని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. ఆర్మీ జవాను కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఇలాంటి చర్యలకు ఎప్పుడూ పాల్పడలేదని గుర్తు చేశారు. తహసీల్దార్ ధర్మరాజుకు లంచం ఇవ్వనందుకే ఇంటి ప్రహరీ కూల్చి వేశారని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ ఆరోపించారు. వారి వెంట జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాశినాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు అంబళ్ల శ్రీరాములనాయుడు, కేవీ సూర్యనారాయణరాజు, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు చనమళ్ల వెంకటరమణ, చిక్కాల సాంబశివరావు, వైస్ చైర్మన్, వైస్ ఎంపీపీలు సముద్రపు రామారావు, పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం, సర్పంచ్ గేదెల రామ చిరంజీవి, ఎంపీటీసీ సభ్యుడు తర్లాడ దుర్గారావు, నాయకులు రేగాన శ్రీనివాసరావు, రాంబార్కి రామారావు, సత్యనారాయణ, తులసి తదితరులు ఉన్నారు.

బీచ్ కబడ్డీ పోటీలకు జిల్లా జట్లు సిద్ధం

- వచ్చే నెల 2 నుంచి రాష్ట్ర స్థాయి పోటీలు



బీచ్ కబడ్డీ పోటీలకు ఎంపికైన జిల్లా జట్లు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న బీచ్ కబడ్డీ పోటీలకు జిల్లా జట్లు సిద్ధమయ్యాయి. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లిమర్ల మండలం సారిపల్లి గ్రామ పరిధిలో గల దిబ్బేశ్వర ఆలయ సమీపంలోని చంపావతి నదిలో ఈ ఎంపిక పోటీలు ఆదివారం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.రంగారావుదొర, కెవి.ప్రభావతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 50 మంది క్రీడాకారులు హాజరుకాగా... ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 2 నుంచి 4 వరకు నెల్లూరు జిల్లా ఇందుకూరులో జరగనున్న అంతర్ జిల్లాల బీచ్ కబడ్డీ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నడిపేన లక్ష్మణరావు తెలిపారు. ఎంపిక పోటీలను కబడ్డీ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి నడిపేన సూర్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు మీసాల శ్రీనివాసరావు, మజ్జి తిరుపతి రావు, బంటుపల్లి శివ ప్రసాద్, కె.గోపాల్, ఆది బాబు తదితరులు పర్యవేక్షించారు.

జిల్లాకు 480 మెట్రిక్ టన్నుల డీఏపీ రాక

- జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు



గూడ్సు రైలు నుంచి లారీలకు ఎక్కిస్తున్న డీఏపీ ఎరువులను పరిశీలిస్తున్న తారకరామారావు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పంపిణీ చేసే నిమిత్తం 480 మెట్రిక్ టన్నుల డీఏపీ ఎరువులతో కూడిన గూడ్సు రైలు వ్యాగన్ ఆదివారం జిల్లాకు వచ్చిందని జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు తెలిపారు. ఈ ఎరువులను ఇప్పటికే ఇండెంట్ పెట్టిన 38 రైతు భరోసా కేంద్రాలు (రైతు సేవా కేంద్రాలు)కు సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. గూడ్సు షెడ్డుకు వచ్చిన డీఏపీ రేక్ మార్క్‌ఫెడ్ మేనేజర్‌తో కలిసి పరిశీలించి లారీలు ద్వారా తరలించే ఏర్పాట్లు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రైతు సేవా కేంద్రాలకు డీఏపీ ఎరువు పంపించినట్టు తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో, ప్రైవేటు డీలర్ల వద్దగానీ అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే సంబంధిత రైతులు మండల వ్యవసాయ అధికారికి తెలియజేయాలన్నారు. ఆయన వెంట వ్యవసాయ సహాయ సంచాలకులు నాగభూషణం, మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరనాయుడు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

'గంజాయి' నియంత్రణకు ప్రత్యేక బృందం

● ఎస్పీ వకుల్ జిందాల్


వకుల్ జిందాల్, ఎస్పీ, విజయనగరం

విజయనగరం క్రైమ్: జిల్లాలో గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు ప్రత్యేకంగా ఒక బృందాన్ని ఏర్పాటుచేశామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు వచ్చే అన్ని రహదారులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఆకస్మికంగా వాహన తనిఖీలు చేపట్టి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు, వాహనాల రికార్డులను పరిశీలించి నిబంధనలు అతిక్రమించిన వాహనదారులకు ఈ చలానాలు విధిస్తున్నామని పేర్కొన్నారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు, గంజాయి పీల్చే వారిని అదుపులోకి తీసుకునేందుకు, వారికి గంజాయి సరఫరా చేసే వ్యాపారులను గుర్తించేందుకు ప్రత్యేకంగా ఒక బృందాన్ని నియమించామని తెలిపారు. ఈ బృందాలు జిల్లాలో ముందుగా గుర్తించిన ప్రాంతాల్లో దాడులు నిర్వహించి, గంజాయి పీలుస్తూ అర్లర్లకు పాల్పడుతున్న వారిని అదుపులోకి తీసుకుని, వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు స్థానిక పోలీసులకు అప్పగిస్తారన్నారు. అంతేకాకుండా, వారికి గంజాయి సరఫరా చేస్తున్న చిన్న వ్యాపారులను, వారికి పెద్ద మొత్తంలో విక్రయించే పెద్ద వ్యాపారులను, వారికి గంజాయి విక్రయించే వ్యక్తులను గుర్తించి, గంజాయి అక్రమ రవాణా నియంత్రణే లక్ష్యంగా ఈ ప్రత్యేక బృందం పనిచేస్తుందన్నారు.

పదేపదే నేరాలకు పాల్పడితే పీడీయాక్ట్ నమోదు

గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు జరిపే నిందితులు పదే పదే నేరాలకు పాల్పడి, పట్టుబడితే వారిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని ఎస్పీ స్పష్టం చేశారు. గంజాయి గురించిన సమాచారాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ ఫోన్ నంబర్ 9121109416కు తెలియజేయాలని ప్రజలను ఎస్పీ కోరారు.

స్కూల్‌గేమ్స్ సెక్రటరీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం టౌన్: స్కూల్‌గేమ్స్ సెక్రటరీ పోస్టుకు అర్హత, ఆసక్తి కలిగిన పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రభుత్వ/జిల్లా పరిషత్ యాజమాన్యంలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఫిజికల్ డైరెక్టర్లు) ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ జి.పగడాలమ్మ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్కూల్‌గేమ్స్ సెక్రటరీగా 2 సంవత్సరాల పదవీకాలం ఉంటుందని పేర్కొన్నారు. రెండు సంవత్సరాలలో పదవీ విరమణ పొందనున్న ఉపాధ్యాయులు, గతంలో స్కూల్‌గేమ్స్ సెక్రటరీగా పని చేసిన వారు, క్రమశిక్షణ చర్యలకు గురైన వారు అనర్హులని పేర్కొన్నారు. పైన తెలిపిన నిబంధనల మేరకు ఈ నెల 29 లోగా ప్రధానోపాధ్యాయుడు, ఉప విద్యాశాఖాధికారి కౌంటర్ సైన్‌తో కార్యాలయం పనిదినాల్లో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని స్పష్టం చేశారు.

రెండు బైక్‌లు ఢీకొని మహిళ మృతి


మృతురాలు లక్ష్మి (ఫైల్)

భోగాపురం: జాతీయ రహదారిపై భోగాపురం మండలంలోని అమనాం జంక్షన్ వద్ద రెండు బైక్‌లు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఆదివారం ఓ మహిళ మృతిచెందింది. ఈ ప్రమాదంపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పూసపాటిరేగ మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన తిరుమల లక్ష్మి(51) భర్త రమణరాజు 20 సంవత్సరాలుగా గ్రామానికి సమీపంలో గల తోటలో పనిచేస్తూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నారు. ఈ మధ్య (ఆరు నెలల క్రితం) వారి కుమారుడి వివాహం జరిగింది. వృత్తి రీత్యా కుమారుడు భార్యతో కలిసి విశాఖపట్నం జిల్లా పరవాడలో నివాసముంటున్నాడు. ఈ నేపథ్యంలో కొడుకు, కోడలిని చూసేందుకు లక్ష్మి పరవాడ వెళ్లింది. తిరిగి ఆదివారం కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై కృష్ణాపురం వస్తుండగా అమనాం జంక్షన్‌కు చేరుకునేసరికి బైక్ అదుపుతప్పి ఎదురుగా వెళ్తున్న చీపురుపల్లి గ్రామానికి వెంకటేశ్వరరావు ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో వెంకటేశ్వరరావుతో పాటు తల్లీకొడుకులు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికుల సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే లక్ష్మి మృతి చెందింది. ద్విచక్ర వాహన చోదకులు ఇద్దరూ తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నారు. మృతురాలి భర్త రమణరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రవికుమార్ తెలిపారు.

కబేళా నుంచి గోవులకు విముక్తి

- సుమారు 400 కిలోల గోమాంసం సీజ్
- ఏకమైన హిందూ ధార్మిక, స్వచ్ఛంద సంస్థలు
- ఎస్పీ చొరవతో గోశాలకు గోవులు
- పరారీలో నిర్వాహకులు


లోపల ఉన్న లేగదూడలు


కబేళా గేటు బయట నిరసన వ్యక్తం చేస్తున్న హిందూ ధార్మిక, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు


తిండిలేక విలవిల్లాడిపోతున్న గోమాతలు

విజయనగరం క్రైమ్: సకల దేవతలు కొలువైన మాతగా హిందూ ధర్మ ఆచార సంప్రదాయాల ప్రకారం గోవుకు అత్యంత ప్రాశస్త్యం ఉంది. అటువంటి గోవులను నిర్దాక్షిణ్యంగా నరికేసి, వాటి మాంసాన్ని అమ్ముకుంటూ డబ్బులు సంపాదించాలనుకునే దుండగుల చెర నుంచి 203 గోవులకు ఎస్పీ వకుల్ జిందాల్ విముక్తి కల్పించారు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి.

విజయనగరంలోని కొత్తపేట స్వీపర్ వీధిలో కొన్నేళ్లుగా కబేళా నడుస్తున్నప్పటికీ ఇంతవరకూ పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. కబేళాకు తీసుకువచ్చిన గోమాతలను మాంసం ముద్దలుగా తయారుచేసి ప్యాకింగ్‌లు చేసి, బహిరంగంగా తరలించేస్తున్నా ఏ ఒక్క అధికారీ పట్టించుకున్న పాపాన పోలేదన్నది వాస్తవం. అయితే శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత కబేళాకు వందల సంఖ్యలో గోవులు తరలివెళ్తున్నట్లు చూసిన హిందూ సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రతిఘటించారు. అప్పటికే కబేళా లోపలికి గోవులను తరలించిన నిర్వాహకులు తాళాలు వేసేశారు. అయితే గోమాతలను రక్షించుకోవాలనే ఉద్దేశంతో ఆయా సంఘాల ప్రతినిధులు తెల్లారేవరకూ కబేళా గేటు బయటే ఉండి ఎస్పీ వకుల్ జిందాల్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఎస్పీ ఆదేశాలతో టూటౌన్ పోలీసులు రంగంలోకి దిగారు. ఆదివారం మధ్యాహ్నం వరకూ హైడ్రామా నడిచింది. లోపల ఉన్న వారంతా పంరారయ్యారు. గేటు బయటే హిందూ ధార్మిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు స్పార్క్ సొసైటీ వ్యవస్థాపకుడు పద్మనాభంతో పాటు పలువురు ధర్నా నిర్వహించారు. కబేళాను గోశాలగా మార్చాలని, లేగదూడలను, ఆవులను దారుణంగా నరికినవారిని, అదేవిధంగా అవినీతికి పాల్పడి రెండు వ్యాన్‌లను రాత్రి సమయంలో వదిలేసిన పోలీస్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. కబేళాను వెంటనే మూసివేయాలని భీష్మించారు. కబేళాలో ఉన్న ఆవులను బయటకు తీసుకువచ్చి దాణా పెట్టాలని కోరారు. పోలీసుల సాయంతో గేట్లు పగులగొట్టి లోపలికి వెళ్లిన వారు గోమాంసంతో పాటు 203 గోవులను గుర్తించారు. సుమారు 400 కిలోల గోమాంసం స్వాధీనం చేసుకున్నట్లు, కోర్టు ఆర్డర్ తీసుకుని ఆ మాంసాన్ని పాతిపెట్టిస్తామని సీఐ కె.రామారావు చెప్పారు. గోవులను గోశాలకు తరలిస్తామన్నారు. మహ్మద్ ఖలీల్ కబేళాను నడుపుతున్నాడని. అతనితో పాటూ మిగతావారు పరారీలో ఉన్నారని తెలిపారు. వారందరినీ అదుపులోకి తీసుకుని, విచారణ చేసి, కేసులు నమోదుచేస్తామని, రెండు వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ స్పష్టం చేశారు.


కబేళా లోపల లభ్యమైన గోమాంసం

మృతుడి కుటుంబానికి పరామర్శ


మృతుడి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురం గ్రామంలో ఇటీవల వైఎస్సార్‌సీపీ కార్యకర్త మర్రాపు సత్యంనాయుడు మృతి చెందడంతో ఆయన కుటుంబసభ్యులను వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు ఆదివారం పరామర్శించారు. మృతుని కుటుంబానికి పార్టీ తరఫున ఎటువంటి అవసరం ఉన్నా శాయశక్తులా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో శిఖబడి సర్పంచ్ కోట రమేష్, గవరమ్మపేట సర్పంచ్ కొల్లి సత్యం నాయుడు, ఎంపీటీసీ మర్రాపు లక్షుంనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు అల్లు ఈశ్వరరావు కార్యకర్తలు ఉన్నారు.

అక్రమ రవాణాను అరికడదాం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్


వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్

విజయనగరం ఫోర్ట్: రాష్ట్రంలో మానవ అక్రమ రవాణను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు ఈనెల30న జరుపుకోనున్న ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నేపథ్యంలో జిల్లా పరిషత్ అతిథి గృహంలో ఆదివారం ఆయన హెల్ప్, విముక్తి సంస్థలు రుపొందించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా నిరోధంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సంబంధిత అన్ని శాఖల విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్, సైబర్ నేరాలను కూడా నియంత్రించడానికి నిరంతర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, జిల్లా బాలల సంక్షేమ సమితి అధ్యక్షురాలు జి. హిమబిందు, మిషన్ వాత్సల్య ప్రతినిధి బి. రామకోటి, చైల్డ్‌లైన్ ప్రతినిధులు మీనా, గౌరి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓల బదిలీలు చేపట్టాలి

విద్యాశాఖ మంత్రికి వినతిపత్రం

ఎంఈఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం

పార్వతీపురంటౌన్: మండల విద్యాశాఖాధికారులకు జీరో సర్వీస్‌తో బదిలీలు చేపట్టాలని ఎంఈఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంఈఓలకు దాదాపు ఏడేళ్లుగా బదిలీలు జరగలేదని, 2017 నుంచి పనిచేస్తున్న స్థానాల్లోనే చాలామంది ఎంఈఓలు పనిచేస్తున్నారని, వారిలో చాలామంది బదిలీల కోసం ఎదురు చూస్తున్న పరిస్థితి ఉందని పేర్కొన్నారు. మండలంలో దాదాపు రెండు వందల మంది టీచర్లకు డ్రాయింగ్ ఆఫీసర్‌గా ఉన్న ఎంఈఓలకు తమ జీతభత్యాల కోసం సెల్ఫ్ డ్రాయింగ్ అధికారం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. కావున ఎంఈఓలకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ కల్పించాలని కోరుతూ ఇటీవల విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు సామల సింహాచలం తెలిపారు.

పాము కాటుతో మహిళ మృతి


మృతురాలు గౌరి (ఫైల్)

గజపతినగరం: మండలంలోని సీతారామపురం గ్రామానికి చెందిన ఓ మహిళ పాము కాటుకు గురై వైద్యసేవలు పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రేజేటి గౌరి (47) తమ పొలంలో పండిన నువ్వు పంట కుప్పలను శనివారం చేయి పెట్టి పరిశీలిస్తుండగా విషసర్పం కాటు (ఉల్లిపాము) వేయడంతో వెంటనే అస్వస్థతకు గురి కాగా స్థానికులు, బంధువులు గజపతినగరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం మహారాజా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. బంధువుల ఫిర్యాదు మేరకు గజపతినగరం ఎస్సై యు.మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైదరాబాద్‌లో చీపురుపల్లి యువకుడి మృతి


మహేష్

చీపురుపల్లి: పట్టణానికి చెందిన కిల్లంశెట్టి మహేష్(25) హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని బజారువీధికి చెందిన మహేష్ హైదరాబాద్‌లో కొరియర్ డెలివరీ బాయ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 25న కొరియర్ డెలివరీకి వెళ్తున్న సమయంలో కారు ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. అయితే బయటకు ఎలాంటి గాయాలు లేకపోవడంతో మహేష్ యథావిధిగా తన రూమ్‌కు వెళ్లిపోయాడు. తరువాత రాత్రి సమయంలో మహేష్ కోమాలోకి వెళ్లిపోవడంతో స్నేహితులు గమనించి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న మృతుడి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

అంగన్‌వాడీలకు చిన్నగుడ్లు!

- గుడ్డు బరువు 50 గ్రాములు ఉండాలి
- 35–40 గ్రాములే ఉంటున్న గుడ్లు
- జిల్లాలో అంగన్‌వాడీ లబ్ధిదారులు 86,538 మంది
- నెలకు రూ.21.63 లక్షల గుడ్లు వినియోగం


పట్టణంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రానికి సరఫరా అయిన చిన్నసైజు గుడ్లు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నసైజు గుడ్లు సరఫరాపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పిచ్చిక గుడ్లు వలే ఉన్నాయంటూ లబ్ధిదారులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇది అధికారులకు తెలిసినా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపిస్తున్నారు. సాధారణంగా 50 గ్రాములు బరువు ఉండే గుడ్లను అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయాలి. ప్రస్తుతం 35–40 గ్రాములు ఉన్న గుడ్లనే సరఫరా చేస్తున్నారు. సబంధిత కాంట్రాక్టర్ గుడ్లను కేంద్రాలకు సరఫరా చేసే సమయంలో సూపర్ వైజర్ పర్యవేక్షించాలి. ఇది ఎక్కడా కానరావడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఐదేళ్లలోపు చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేయాలి. పిల్లలకు ప్రతిరోజు ఉడికించిన గుడ్డు ఇవ్వాలి. గర్భిణులు, బాలింతలకు కూడా టేక్ హోమ్ రేషన్ కింద నెలకు 25 గుడ్లు సరఫరా చేయాలి. వీటితో పాటు పిల్లలకు మధ్యాహ్న భోజనం, పాలు, గర్భిణులకు నెలకు సరిపడా పాలు, చెక్కీలు, బెల్లం, రాగిపిండి, కర్జూరం వంటివి అందిస్తారు.

చర్యలు తీసుకుంటాం

> అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నసైజు గుడ్లు సరఫరా అవుతున్నట్టు తన దృష్టికి రాలేదు. విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. పెద్దసైజు గుడ్లు సరఫరా చేసేలా ఆదేశాలు ఇస్తాం. – బి.శాంతకుమారి, పీడీ, ఐసీడీఎస్

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 11 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. 11 ప్రాజెక్టుల్లో 2,499 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 7 నుంచి 3 సంవత్సరాల లోపు పిల్లలు 44,745 మంది, 3 నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలు 23,255 మంది, గర్భిణులు 9,930 మంది, బాలింతలు 9,668 మంది ఉన్నారు. వీరికి నెలకు 21.53 లక్షల గుడ్లు అవసరం. అధికారులు స్పందించి పెద్దసైజు గుడ్లు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

పత్తితోటలో ఏనుగులు


పత్తితోటలో సంచరిస్తున్న ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని కుందరతిరువాడ గ్రామంలో పత్తితోటలో ఆదివారం ఏనుగులు దర్శనమిచ్చాయి. చెరకు, అరటి, పామాయిల్ తోటల్లో ఉన్న ఏనుగులు వరి, పత్తి చేనులోకి జారుకున్నాయి. పంటలను ధ్వంసం చేస్తున్నా అటవీశాఖాధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబందిత అధికారులు స్పందించి ఏనుగులను తరలించే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹105	₹180	₹190

కుష్ఠుతో చాలా కష్టం

- జిల్లాలో విస్తరిస్తున్న వ్యాధి
- ఇంటింటి సర్వేలో నమోదవుతున్న కొత్త కేసులు
- ఇప్పటివరకు 2,932 మంది అనుమానితుల గుర్తింపు
- 912 మందికి పరీక్షలు
- 16 మందికి వ్యాధి నిర్ధారణ
- ఈనెల 18న ప్రారంభమైన ఇంటింటా సర్వే


గంట్యాడ మండలంలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది


శరీరంపై ఉన్న కుష్ఠు వ్యాధి మచ్చలు

విజయనగరం ఫోర్ట్: కుష్ఠు వ్యాధి జిల్లాలో చాప కింద నీరులా వ్యాపిస్తోంది. జిల్లాలో నిర్వహిస్తున్న ఇంటింటా నిర్వహించే సర్వేలో కొత్త కేసులు బయట పడుతున్నాయి. కుష్ఠు వ్యాధిపై అవగాహన లేకపోవడం, వ్యాధి లక్షణాల గురించి బయటకు చెబితే ఏమనుకుంటారోననే అవమానంతో వ్యాధి తీవ్రమయ్యే వరకు చాలామంది బయటకు చెప్పడం లేదు. దీంతో కుష్ఠు వ్యాధి బాధితులు పెరుగుతున్నారు. వ్యాధిని త్వరగా గుర్తించడం వల్ల వ్యాప్తిని అరికట్టగలగడంతో పాటు రోగులు అంగవైకల్యం బారిన పడకుండా కాపాడడానికి అవకాశం ఉంటుంది.

16 కొత్త కేసులు నమోదు

జిల్లాలో ఈనెల 18 వతేదీ నుంచి కుష్ఠు వ్యాధి గుర్తింపు సర్వే ఇంటింటా ప్రారంభమైంది. ఈ సర్వేలో 1790 టీమ్‌లు పనిచేస్తున్నాయి. ఇప్పటి వరకు 2,63,338 ఇళ్లలో 8,49,283 మందిని సర్వే చేశారు. ఈ సర్వేలో 2,932 మందికి వ్యాధి లక్షణాలున్నట్లు అనుమానితులను గుర్తించారు. వారిలో ఇప్పటివరకు 916 మందికి పరీక్షలు చేయగా 16 కొత్త కేసులు నమోద య్యాయి. జిల్లాలో ప్రస్తుతం 272 మంది కుష్ఠు వ్యాధి చికిత్స పొందుతున్నారు.

రోజుకు 20నుంచి 25 ఇళ్ల సర్వే

ఆశవర్కర్, మేల్ వలంటీర్‌తో కూడిన టీమ్ వారి పరిధిలోని 20 నుంచి 25 ఇళ్లను ప్రతి రోజూ సర్వే చేస్తున్నారు. ఇంట్లో ఉన్న ప్రతి ఒక్కరినీ సర్వే చేస్తారు. స్పర్శ, నొప్పి లేని మచ్చలు ఏమైనా ఉన్నాయా అని వైద్య సిబ్బంది అడిగి వివరాలు నమోదు చేసుకోవాలి. సర్వే సిబ్బందికి సందేహాలు ఉంటే సంబంధిత పీహెచ్‌సీ వైద్యాధికారిని సంప్రదించి నివృత్తి చేసుకుంటారు.

వ్యాధి సోకేది ఇలా

కుష్ఠు వ్యాధి మైకో బాక్టీరియం లెప్రే అనే బాక్టీరియా వల్ల సోకుతుంది. ఈ వ్యాధి చర్మానికి, నరాలకు సోకుతుంది. వ్యాధిగ్రస్తులు తుమ్మినా, దగ్గినా తుంపర్ల ద్వారా దగ్గరలో ఉన్న వారికి కుష్ఠు వ్యాధి సోకే ఆస్కారం ఉంది.

చికిత్స రెండు రకాలు

పాసీ బ్యాసిల్లరీ (పీబీ) అంటే కుష్ఠు వ్యాధి సోకిన వ్యక్తికి ఒకటి నుంచి ఐదు మచ్చలు ఉంటే పాసీ బ్యాసిల్లరీగా గుర్తిస్తారు. వారికి ఆరు నెలలు చికిత్స ఉంటుంది.

మల్టీ బ్యాసిల్లరీ(ఎండి) అంటే ఐదు మచ్చల కంటే ఎక్కువ ఉంటే వారిని మల్టీ బ్యాసిల్లరీగా గుర్తిస్తారు. వారికి 12 నెలల చికిత్స ఉంటుంది.

వ్యాధి లక్షణాలు

- చర్మంపై స్పర్శలేని మచ్చలు
- మందమైన మెరిసే జిడ్డుగల చర్మం, బత్తాయి తొక్కలా ఉండడం
- చెవులు, వీపు, ఎదపై నొప్పి లేని బొడిపెలు
- కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం
- ముక్కు దిబ్బడ, ముక్కులో నుంచి రక్తం కారడం
- కాళ్లు, చేతులు తిమ్మిర్లు కలిగి ఉండడం
- అరచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం
- చల్లని లేదా వేడి వస్తువులను గుర్తించలేకపోవడం
- చేతుల నుంచి వస్తువులు జారిపోవడం
- కాళ్లకు చెప్పులు జారిపోవడం
- తెలియకుండానే చేతులు, కాళ్లలో బొబ్బలు రావడం
- చేతి వేళ్లు, కాలి వేళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం

ఇంటింటా సర్వే చేయిస్తున్నాం

> కుష్ఠు వ్యాధిపై జిల్లా వ్యాప్తంగా ఇంటింటా సర్వే చేయిస్తున్నాం. ఈనెల 18 నుంచి ప్రారంభించిన సర్వే ఆగస్టు 2 వతేదీ వరకు జరుగుతుంది. ఇప్పటి వరకు సర్వేలో 16 కొత్త కేసులు నమోదయ్యాయి. కుష్ఠు వ్యాధి నిర్ధారణ అయిన వారికి తక్షణమే చికిత్స ప్రారంభిస్తాం.
> డాక్టర్ కె.రాణి, కుష్ఠు వ్యాధి నివారణ జిల్లా అధికారి